క్లుప్తంగా

గొర్రెల పంపిణీ చేపట్టండి

సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీశైలం

కందుకూరు: రెండో విడత గొర్రెల పంపిణీని ప్రభుత్వం వెంటనే చేపట్టాలని గొర్రెలు, మేకల సంఘం జిల్లా అధ్యక్షుడు గౌర శ్రీశైలం కోరారు. సోమవారం మండల కేంద్రంలో గొర్రెలు, మేకల సంఘం మండల అధ్యక్షుడు పాలేష్ ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. లేమూరు, అగర్‌మియాగూడ గ్రామాల పరిధిలో ఉన్న అటవీ భూముల్లోకి గొర్రెలను అటవీ అధికారులు రానివ్వడంలేద న్నారు. దీంతో పెంపకందార్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి మేతకు అటవీ భూముల్లోకి అనుమతించాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పెంటయ్య, నాయకులు అంజయ్య, శేఖర్‌, బాలకృష్ణ, సుభాన్‌, ప్రశాంత్‌, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులు కేవైసీ చేయించుకోవాలి

పీఏసీఎస్‌ చైర్మన్‌ చంద్రశేఖర్‌



కందుకూరు: కందుకూరు ప్రాథమిక వ్యవసాయ సహకారా సంఘం(పీఏసీఎస్‌) పరిధిలో రూ.3.36 కోట్ల మేర రుణమాఫీ అయ్యిందని పీఏసీఎస్‌ చైర్మన్‌ డి.చంద్రశేఖర్‌ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 1015 మంది రైతులకు రుణమాఫీ అయ్యిందన్నారు. అప్పు తీసుకున్న సభ్యులు తప్పనిసరిగా ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం జిరాక్స్‌లు, ప్రస్తుత పహాణీ ప్రతులతో పాటు నాలుగు పాస్‌పోర్టు సైజ్‌ ఫొటోలతో వచ్చి కార్యాలయంలో కేవైసీ నమోదు చేయించుకోవాలన్నారు. కేవైసీ చేసుకున్న రైతులకు మాత్రమే సంఘంలో సభ్యత్వం ఉంటుందన్నారు. 105 మంది రైతులకు దీర్ఘకాలిక అప్పుల కోసం రూ.6 కోట్ల నిధులకు దరఖాస్తులు వచ్చాయని, వాటి మంజూరుకు ప్రతిపాదనలు చేస్తున్నామన్నారు. పంట రుణాల కోసం మరో 120 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. వారికి త్వరలో అందిస్తామన్నారు.

పంచాయతీ రికార్డుల తనిఖీ



రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ

యాచారం: మండల పరిధిలోని మాల్‌ గ్రామ పంచాయతీ రికార్డులను సోమవారం ఎంపీడీఓ విజయలక్ష్మి తనిఖీ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మంజూరవుతున్న నిధుల ద్వారా చేపట్టే అభివృద్ధి పనుల రికార్డులను తనిఖీ చేశారు. మంజూరైన నిధులు, ఖర్చు చేసే వివరాలను పరిశీలించారు. పశువుల సంత వల్ల వచ్చే ఆదాయాన్ని ఏ అభివృద్ధి పనులకు ఖర్చు చేస్తున్నారనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. పశువుల సంతలో పశువులకు గాని, రైతులకు గాని ఇబ్బందులు రాకుండా సౌకర్యాలు కల్పించాలని పంచాయతీ కార్యదర్శి రాజుకు సూచించారు. నిధుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

నేడు ‘చలో మైదాన్‌’

హుడాకాంప్లెక్స్‌: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం సరూర్‌నగర్‌ ఇండోర్‌ స్టేడియంలో ‘చలో మైదాన్‌’ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి ఇ.వెంకటేశ్వర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారతీయ హాకీ మాంత్రికుడు మేజర్‌ ధ్యాన్‌చంద్‌ జయంతి సందర్భంగా ఉదయం 10గంటలకు ఇండోర్‌ స్టేడియంలో క్రీడలపై అవగాహన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్‌ కన్వీనర్‌గా చంద్రశేఖర్‌

మలక్‌పేట: టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్‌ కన్వీనర్‌గా మలక్‌పేట నియోజకవర్గానికి చెందిన బోనగిరి చంద్రశేఖర్‌ నియమితులయ్యారు. గాంధీభవన్‌లో సోమవారం టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్‌ చైర్మన్‌ నాగరిగారి ప్రీతమ్‌ చేతుల మీదుగా నియామక పత్రాన్ని తీసుకున్నారు. మూసారంబాగ్‌లోని నివాసంలో చంద్రశేఖర్‌ మాట్లాడుతూ.. ఎస్సీల వర్గాలను చైతన్య పరిచి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేవెళ్ల సభలో ప్రకటించిన ఎస్సీ డిక్లరేషన్‌ పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి, ప్రీతమ్‌, టీపీసీసీ కార్యదర్శి శ్రీనివాస్‌, సీనీయర్‌ నేతలు నరేందర్‌, కేశవరావు పటేల్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

నేనున్నానని..

పేద విద్యార్థులకు బాసటగా వైఆర్‌పీ ఫౌండేషన్‌

ఇప్పటివరకు 1,500 మందికి ఆర్థిక చేయూత



విద్యార్థినికి చెక్కు అందజేస్తున్న ఫౌండేషన్‌ చైర్మన్‌ రవిప్రసాద్‌

హుడాకాంప్లెక్స్‌: లక్ష్మీ కటాక్షం లేని నిరుపేద సరస్వతీపుత్రులకు ఆయన అండగా నిలుస్తున్నారు. తను సంపాదించిన దాంట్లో కొంత మొత్తాన్ని నిరుపేద విద్యార్థుల చదువుకు కేటాయిస్తూ ఇతరులకు మార్గదర్శకంగా నిలుస్తున్నారు. ఆయనే వైష్ణోయి గ్రూప్‌ అధినేత, వైఆర్‌పీ ఫౌండేషన్‌ చైర్మన్‌ యెలిశాల రవిప్రసాద్‌. నల్లగొండ జిల్లాకు చెందిన యెలిశాల రవిప్రసాద్‌ చాలాఏళ్ల క్రితం నగరానికి వచ్చి నిర్మాణం, రియల్‌ ఎస్టేట్‌, ఆటో మొబైల్స్‌, టెక్స్‌టైల్స్‌ వంటి పరిశ్రమలు స్థాపించి కోట్ల రూపాయలు సంపాదించారు. వ్యాపారం ద్వారా సంపాదించిన మొత్తంలో ఎంతోకొంత పేదలకు దానం చేయాలని భావించారు. ఈ క్రమంలో వైఆర్‌పీ ఫౌండేషన్‌ ఏర్పాటు చేశారు. పది, ఇంటర్‌, ఇంజినీరింగ్‌, మెడిసెన్‌ కోర్సుల్లో ఉత్తమ మార్కులు సాధించిన పేద విద్యార్థులకు తనవంతు సహాయం చేయాలని నిర్ణయించి, ఆ మేరకు ఇప్పటివరకు ఆ సంస్థ ద్వారా 1,500 మందికి పైగా విద్యార్థులకు ఆర్థికంగా చేయూతనందించారు.

సేవలను విస్తృతం చేస్తాం..

ఫౌండేషన్‌ ద్వారా ఆర్థిక సహకారం పొందిన వారిలో ఎంతో మంది పోలీసు, రెవెన్యూ ఇతర ప్రభుత్వ విభాగాల్లో ఉద్యోగాలు సంపాదించారు. పలువురు విదేశాల్లోనూ స్థిరపడ్డారు. ఇప్పటివరకు సొంత జిల్లాకే పరిమితమైన ఈ సేవలు తాజాగా నగరానికి విస్తరింపజేయాలని నిర్ణయించి, ఆ మేరకు కొత్తపేట వాసవీకాలనీలో వైఆర్‌పీ ఫౌండేషన్‌ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఈ ఫౌండేషన్‌ ద్వారా పేద విద్యార్థులకు ఆర్థికంగా చేయూతనందించడమే తన లక్ష్యమని ఆయన చెబుతున్నారు.

నేను కూడా సేవ చేస్తా



ఫౌండేషన్‌ అందించిన ఆర్థిక సహకారంతో ఇంజినీరింగ్‌ చదువుతున్నాను. జీవితంలో స్థిరపడిన తర్వాత నేను కూడా పేద విద్యార్థులకు సేవ చేస్తాను. యెలిశాల రవిప్రసాద్‌ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుంటాను.

– సాయికృష్ణ, బీటెక్‌, సీవీఆర్‌ కాలేజీ

ఐఏఎస్‌ కావడమే లక్ష్యం



మా కుటుంబం ఆర్థికంగా వెనుకబడి ఉంది. ఇదే సమయంలో వైఆర్‌పీ ఫౌండేషన్‌ అండగా నిలిచింది. వీరు చేసే సహాయం కూడా నేరుగా కాలేజీ యాజమాన్యాల పేరునే ఇస్తున్నారు. మంచిగా చదివి భవిష్యత్‌లో ఐఏఎస్‌ అవుతా.

– జ్యోతిక, బీటెక్‌, వర్ధమాన్‌ ఇంజినీరింగ్‌ కళాశాల

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



పంచాయతీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సబితారెడ్డి

మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: మండల పరిధిలోని డబీల్‌గూడ, నాగారం, గొల్లూరు గ్రామాల్లో మంత్రి సబితారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్‌ తీగల అనితారెడ్డి సోమవారం రూ.2 కోట్ల నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఇళ్లులేని నిరుపేదలను గుర్తించి ప్రభుత్వం డబుల్‌ బెడ్‌రూమ్స్‌ ఇవ్వడంతో పాటు ఇంటి వద్ద ఖాళీ జాగా ఉండి ఇళ్లు నిర్మాణం చేసుకునేందుకు గృహలక్ష్మి పథకం కింద రూ.3 లక్షల సహాయం అందిస్తుందన్నారు. డబీల్‌గూడలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణం పనులకు శంకుస్థాపన, నాగారం–పడమటితండా వరకు బీటీ రోడ్డు నిర్మాణం, గొల్లూరులో నూతన గ్రామ పంచాయతీ భవనం, సీసీ రోడ్ల నిర్మాణ పనులను వారు ప్రారంభించారు. బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్‌ ఎంపీపీ సునీతానాయక్‌, మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్‌ చైర్మన్‌ పాండు యాదవ్‌, వైస్‌ చైర్మన్‌ వెంకటేశ్వరరెడ్డి, డబీల్‌గూడ, నాగారం, పడమటి తండా, గొల్లూరు గ్రామ సర్పంచ్‌లు బి.శంకర్‌, లావణ్య, అనితా నాయక్‌, కవిత, ఎంపీటీసీ సభ్యులు స్వప్న, వెంకటేష్‌, రమేష్‌, తహసీల్దార్‌ మహమూద్‌ అలీ, ఎంపీడీఓ నర్సింహ, బీఆర్‌ఎస్‌ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మున్నూరుకాపుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

మున్నూరుకాపుల సంక్షేమానికి బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని అమీర్‌పేట్‌ గ్రామానికి చెందిన మున్నూరుకాపు ప్రజా ప్రతినిధులు, సంఘం నాయకులు సోమవారం నగరంలోని మంత్రి నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మున్నూరుకాపుల అభివృద్ధికి బీఆర్‌ఎస్‌ సర్కార్‌ కట్టుబడి ఉందన్నారు. మున్నూరుకాపు సంఘం మినీహాల్‌ నిర్మాణానికి నిధులు కేటాయించాలని సంఘం నాయకులు కోరగా మంత్రి సానుకూలంగా సన్మానించారు. బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. అమీర్‌పేట్‌ గ్రామ మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు రఘుపతి, గ్రామ ఉపసర్పంచ్‌ నర్సింగ్‌, పీఏసీఎస్‌ డైరెక్టర్‌ పెద్ద నర్సింహ, కోఆప్షన్‌ సభ్యుడు అశోక్‌, బీఆర్‌ఎస్‌ నాయకులు రాయప్ప, మార్కెట్‌ కమిటీ డైరెక్టర్‌ దేవవరం గౌడ్‌, మున్నూరుకాపు సంఘం కోశాధికారి శ్రీశైలం, జనరల్‌ సెక్రటరీ భిక్షపతి, గ్రామ బీఆర్‌ఎస్‌ అధ్యక్షుడు వెంకటేష్‌, సంఘం సభ్యులు పాల్గొన్నారు.



వెంకట్‌రెడ్డిని సత్కరిస్తున్న అనురాధ

వెంకట్‌రెడ్డికి సత్కారం

ఆమనగల్లు: నాగర్‌కర్నూల్‌ జిల్లా రెడ్డి సేవాసమితి ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన ఆమనగల్లు పట్టణానికి చెందిన రూపం వెంకట్‌రెడ్డిని సోమవారం జెడ్పీటీసీ అనురాధ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సరిత పంతునాయక్‌, మున్సిపాలిటీ బీఆర్‌ఎస్‌ అధ్యక్షుడు పత్యానాయక్‌, సర్పంచ్‌ సోన శ్రీనునాయక్‌, నాయకులు తిరుపతి వినోద్‌ తదితరులు పాల్గొన్నారు. అలాగే రూపం వెంకట్‌రెడ్డిని బీఆర్‌ఎస్‌ రాష్ట్ర నాయకులు గోలి శ్రీనివాస్‌రెడ్డి సత్కరించారు. నాయకులు సుభాష్‌, నాగులునాయక్‌, శివకుమార్‌, సతీష్‌, సుమన్‌నాయక్‌, శేఖర్‌, పవన్‌నాయక్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభం

తుర్కయంజాల్‌: కాలనీవాసులు సంఘటితంగా ఉంటూ సంక్షేమ సంఘం భవనాన్ని సద్వినియోగం చేసుకోవాలని 9వ వార్డు(రాగన్నగూడ) కౌన్సిలర్‌ రేవల్లి హరిత అన్నారు. సోమవారం ఎస్‌ఎస్‌ఆర్‌ నగర్‌లోని అంబేడ్కర్‌ సంక్షేమ సంఘం ప్రహరీ గోడ నిర్మాణానికి ఆమె భూమిపూజ చేశారు. రూ.5లక్షల వ్యయంతో ఈ పనులు చేపడుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. వార్డు అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. నాయకులు భీంరెడ్డి, యాదగిరి, భద్రయ్య పాల్గొన్నారు.



ప్రహరీ పనులను ప్రారంభిస్తున్న కౌన్సిలర్‌ హరిత

రాజేందర్‌గౌడ్‌కు సన్మానం

ఆమనగల్లు: కల్వకుర్తి తాలుకా గౌడ యువజన సంఘం కార్యదర్శిగా నియమితులైన కడ్తాలకు చెందిన కందికంటి రాజేందర్‌గౌడ్‌ను సోమవారం గౌడసంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అంతకుముందు కడ్తాల మండల కేంద్రంలోని శ్రీ కంఠ మహేశ్వరస్వామి ఆలయంలో గౌడసంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాల పండుగ ఏర్పాట్లపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మండల గౌడసంఘం అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్‌, నాయకులు గణేశ్‌గౌడ్‌, సుధాకర్‌గౌడ్‌, మహేశ్‌గౌడ్‌, కేశవులు, జగదీశ్‌, శ్రీరాములు, రమేశ్‌, శ్రీను, శ్రీకాంత్‌, వెంకటయ్య, రమేశ్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.



రాజేందర్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

హామీలు నెరవేర్చాలి: టీడీపీ

మంచాల: బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని టీటీడీపీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి చింతకింది చక్రపాణి డిమాండ్‌ చేశారు. సోమవారం మంచాల తహసీల్దార్‌ కార్యాలయంలో ఈమేరకు తహసీల్దార్‌ వెంకటప్రసాద్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్‌, ఎస్సీసెల్‌ రాష్ట్ర కార్యదర్శి కృష్ణ, తెలుగు రైతు సంఘం మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, నాయకులు చంద్రయ్య, శంకర్‌ పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు



పూజలో పాల్గొన్న మంత్రి సబితారెడ్డి, నాయకులు

మహేశ్వరం: మండల పరిధిలోని మొహబ్బత్‌నగర్‌ గ్రామంలో సోమవారం బాలంజనేయ స్వామి ఆలయంలో విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో అభిషేకం, హారతి, కుంకుమార్చన, పుష్పాలంకరణతో పాటు ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన పూజలు నిర్వహించారు. మంత్రి సబితారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్‌ తీగల అనితారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, టీపీసీసీ జనరల్‌ సెక్రటరీ చిగురింత పారిజాతరెడ్డి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్‌, కాంగ్రెస్‌ నాయకులు కొత్త మనోహర్‌రెడ్డి తదితరులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మొహబ్బత్‌నగర్‌ గ్రామ సర్పంచ్‌ సువర్ణ, ఉపసర్పంచ్‌ మానస శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీటీసీ రామిరెడ్డి, తుమ్మలూరు సర్పంచ్‌ సువర్ణ, మాజీ సర్పంచ్‌ కరుణాకర్‌రెడ్డి, బీజేపీ సీనియర్‌ నాయకులు శ్రీరాములు యాదవ్‌, బీఆర్‌ఎస్‌ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, కాంగ్రెస్‌ నాయకులు శివయాదవ్‌ పలువురు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి



ఆమనగల్లు: ఆర్థికసాయం అందిస్తున్న రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని ఐక్యతా ఫౌండేషన్‌ చైర్మన్‌, కాంగ్రెస్‌ పార్టీ నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని జంగారెడ్డిపల్లి గ్రామంలో సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని హనుమాన్‌ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాభివృద్ధికి తనవంతుగా ఆర్థికసాయం అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కడ్తాల మండలం మక్తమాధారంలో ఇటీవల మృతిచెందిన కాంగ్రెస్‌ నాయకులు లింగం కుటుంబ సభ్యులను పరామర్శించి ఆయన కుటుంబ సభ్యులకు రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. అనంతరం సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి వస్తేనే పేదలకు న్యాయం జరుగుతుందని ఆయన చెప్పారు. కాంగ్రెస్‌ పార్టీ విజయం కోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు పాలకుర్ల రవికాంత్‌గౌడ్‌, నాయకులు మహేశ్‌, శ్రీకాంత్‌, మహేశ్‌గౌడ్‌, యాదగిరి, మహేందర్‌, సురేశ్‌, బాలకృష్ణ, శేఖర్‌, పవన్‌, కృష్ణ యాదవ్‌, చంద్రశేఖర్‌ తదితరులు ఉన్నారు.

అసోషియేషన్‌కు అండగా ఉంటాం..

లారీ ఓనర్స్‌ అండ్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకుడు, ఐక్యతా ఫౌండేషన్‌ చైర్మన్‌ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని క్రాస్‌ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన లారీ ఓనర్స్‌ అండ్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. సమస్యల సాధనకు అందరూ ఏకతాటిపైకి వచ్చి లోడింగ్‌, అన్‌ లోడింగ్‌, లాభ నష్టాలను గురించి చర్చించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లారీ ఓనర్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు గోవిందు సైదులు, ఉపాధ్యక్షుడు తిర్పతయ్య, కోశాధికారి రాందేవ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి యూనుస్‌, కార్యదర్శి సుమన్‌రెడ్డి, సభ్యులు రాజు, జంగయ్యగౌడ్‌, నిరంజన్‌, బాబా, ఐలేష్‌, శేఖర్‌, రమేష్‌, శ్రీశైలం, వెంకటేష్‌, తదితరులు పాల్గొన్నారు.

డిక్లరేషన్‌తో బీఆర్‌ఎస్‌కు ముచ్చెమటలు

తలకొండపల్లి: కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి రాగనే ఏకకాలంలో రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేస్తామని టీపీసీసీ కిసాన్‌సెల్‌ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడారు. రాయితీపై అందజేస్తోన్న సబ్సిడీ పథకాలను ప్రభుత్వం ఎత్తివేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్‌ సర్కార్‌ ఒకే దఫా రైతు రుణమాఫీ చేయలేక చేతులు ఎత్తివేసిందని, దీంతో రైతులు మిత్తీలు కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌ ప్రభుత్వ హయాంలో దేశ వ్యాప్తంగా ఒకే ధపాలో రూ.లక్ష రుణమాఫీ చేశామని గుర్తుచేశారు. అకాల వర్షాలు, వడగళ్ల వానకు పంటలు నష్టపోయిన రైతలకు నష్ట పరిహారం అందించడంలో సీఎం కేసీఆర్‌ ఘోరంగా విఫలమయ్యారన్నారు. చేవెళ్ల గడ్డపై ఎస్సీ ఎస్టీ డిక్లరేషన్‌ ప్రకటించడంతో బీఆర్‌ఎస్‌కు ముచ్చెమటలు పడుతున్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ ఇంటింటికి తీసుకపోయి కాంగ్రెస్‌ పార్టీని అధికారంలోకి తీసుకొస్తామన్నారు. కాంగ్రెస్‌ పాలిత రాష్ట్రాల్లో తెలంగాణ కంటే మెరుగైన పాలన అందుతుందన్నారు.

రాబోయేది బీజేపీ ప్రభుత్వమే



అందెల సమక్షంలో బీజేపీలో చేరిన నాయకులు

నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల

బడంగ్‌పేట్‌: రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే అని ఆ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్‌ అన్నారు. సోమవారం బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్‌లో అందెల శ్రీరాములు సమక్షంలో గాంధీనగర్‌కు చెందిన పలువురు బీజేపీలో చేరారు. ఆయన మాట్లాడుతూ.. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మహేశ్వరం నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగురవేస్తామన్నారు. కార్యక్రమంలో బడంగ్‌పేట కార్పొరేషన్‌ అధ్యక్షుడు వెంకటరెడ్డి, సీనియర్‌ నాయకులు మహేందర్‌, బీజేవైఎం నగర అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, కార్పొరేషన్‌ మాజీ అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్‌, అరవింద్‌రెడ్డి, రవికాంత్‌గౌడ్‌, అమరేందర్‌రెడ్డి, న ర్సింగ్‌, నరేందర్‌ కుమార్‌, మహేష్‌ తదితరులున్నారు.

మహిళలు స్వయం ఉపాధితో ఎదగాలి



సర్టిఫికెట్లు అందుకున్న మహిళలతో నిత్యారెడ్డి

జెడ్పీటీసీ సభ్యురాలు నిత్యారెడ్డి

మంచాల: మహిళలు చేతి వృత్తులు తప్పక నేర్చుకోవాలని మంచాల జెడ్పీటీసీ సభ్యురాలు మర్రి నిత్యారెడ్డి అన్నారు. మంచాల మండల పరిధిలోని దాద్‌పల్లి గ్రామంలో నెలరోజులుగా ఉచితంగా టైలరింగ్‌, బ్యూటీషన్‌ కోర్సు నేర్చుకున్న మహిళలకు సోమవారం సర్టిఫికెట్లను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు కేవలం వంటింటికే పరిమితం కావొద్దన్నారు. మగవారితో సమానంగా ప్రభుత్వం కల్పించిన అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. ప్రధానంగా మహిళలు స్వయం శక్తితో ఎదగడానికి కృషి చేయాలన్నారు. అందులో భాగంగానే చేతివృత్తులు నేర్చుకొని స్వయం ఉపాధి కలిగి ఉండాలన్నారు. అప్పుడే ఆర్థికంగా ఎదగడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. మహిళాఅభివృద్ధి శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత టైలరింగ్‌ శిక్షణలో 25 మందికి, బ్యూటీషన్‌లో మరో 25మందికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ శాంతిశ్రీ, సర్పంచ్‌ దొర్జి, ఎంపీటీసీ సభ్యురాలు అనిత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌ సత్తమ్మ, అంగన్‌వాడీ టీచర్‌ పద్మ, మహిళా ప్రాంగణ ఇన్‌స్పెక్టర్‌ గీత పాల్గొన్నారు.

పీఆర్‌సీ, ఐఆర్‌ ప్రకటించాలి: తపస్‌

మంచాల: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరించాలని తపస్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌ డిమాండ్‌ చేశారు. సోమవారం మంచాల మండలంలోని పలు పాఠశాలల్లో తపస్‌ ఉపాధ్యాయ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం వెంటనే పీఆర్‌సీని ఏర్పాటు చేసి 25శాతం ఐఆర్‌ను ప్రకటించాలన్నారు. ఉపాధ్యాయులకు చెల్లించవల్సిన పెండింగ్‌ బిల్లులు చెల్లించాలని డిమాండ్‌ చేశారు. ఉపాధ్యాయులు సురేష్‌కుమార్‌, జిల్లాబాధ్యులు నర్సింహ పాల్గొన్నారు.



సభ్యత నమోదులో రమేష్‌, ఉపాధ్యాయులు

బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయండి

మంగళూర్‌ నార్త్‌ ఎమ్మెల్యే భరత్‌శెట్టి

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం బైక్‌ ర్యాలీ నిర్వహించారు. స్థానిక పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కల్వకుర్తి ఇన్‌చార్జి, మంగళూర్‌ నార్త్‌ ఎమ్మెల్యే భరత్‌శెట్టి మాట్లాడుతూ.. కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో బీజేపీ విజయం కోసం నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని కోరారు. అనంతరం ఆమనగల్లు నుంచి కల్వకుర్తికి చేపట్టిన బీజేపీ బైక్‌ ర్యాలీని ఎమ్మెల్యే భరత్‌శెట్టి ప్రారంభించారు. బైక్‌ ర్యాలీలో బీజేపీ జాతీయ నాయకులు ఆచారి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు హరిప్రసాద్‌, మున్సిపల్‌ చైర్మన్‌ రాంపాల్‌నాయక్‌, వైస్‌ చైర్మన్‌ దుర్గయ్య, మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు శ్రీకాంత్‌సింగ్‌, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు వెంకటేశ్‌ పాల్గొన్నారు.

వార్డు అధికారుల నియామకం

తుక్కుగూడ: రెవెన్యూ శాఖ నుంచి తుక్కుగూడ మున్సిపాలిటీలో విధుల్లో చేరిన వీఆర్‌ఓ, వీఆర్‌ఏలకు వార్డు అధికారలు, ఇతర శాఖల భాద్యతలను అప్పగిస్తున్నట్లు మున్సిపల్‌ కమిషనర్‌ బి.వెంకట్రామ్‌ తెలిపారు. వారి వివరాలు మీకోసం..

వార్డు అధికారుల వివరాలు

వార్డు	అధికారి పేరు	సెల్‌ నెంబర్‌
01	కె.గిరిష్‌కుమార్‌	9032343992
02,03	పి.మనోహర్‌	9948949201
04,05	జే.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి	9866683040
06	బి.యాదమ్మ	8977897715
07	కే.శ్రీహరి	9010627206
08	సరిత	9912013884
09,10	జి.రామచంద్రయ్య	9652118248
11	మహేష్‌	9390422490
12,13	ప్రవీణ్‌	7989151684
14,15	కృష్ణ	9848711532